


నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 31

# అమృతం కురిపించిన తిలక్



'గత చారిత్రక యశఃకలాపమ్ము వివరింపకు
బహుళ వీరానేక గాథాసహస్రమ్ము వినిపింపకు
ఇంక నన్ను విసిగింపకు
నేడు నేను కన్నీరుగా కరిగిన గీతికను
సిగ్గుతో రెండుగా చీలిన వెదురు బొంగును
మంటలో అంతరాంతర దగ్ధమైన బూడిదను
పైన దైవమునకు, కింద మానవునకు జవాబు చెప్పవలసిన వాణ్ణి
రసాతల మంట శిరస్సు వంచిన వాణ్ణి
ఈ రోజు నేను చూసినదేమి? విధి యిన్ని కత్తులు దూసినదేమి?'

ఇంతకీ ఆయన చూసిందేమిటి? ఇంతటి 'ఆర్తగీతం' చెప్పటానికి మూల కారణమేమిటి?

'నేను చూశాను నిజంగా ఆకలితో అల్లాడి మర్రిచెట్టు కింద మరణించిన ముసలివాణ్ణి!
నేను చూశాను నిజంగా నీరంధ్ర వర్షాన వంతెన కింద
నిండు చూలాలు ప్రసవించి మూర్ఛిల్లిన దృశ్యాన్ని!
నేను చూశాను నిజంగా తల్లి లేక, తండ్రి లేక, తిండి లేక ఏడుస్తూ ఏడుస్తూ
ముంజేతుల కన్నులు తుడుచుకుంటూ మురికి కాల్వ పక్కనే నిద్రించిన మూడేళ్ళ పసిబాలుణ్ణి!
నేను చూశాను నిజంగా పిల్లలకు గంజి కాసి పోసి తాను నిరాహారుడై
రుద్ధ బాష్పా కులిత నయనుడై ఆఫీసుకి వచ్చిన వృద్ధుని!'

ఇది ఆర్తనాదమే కాదు. వేదనా గీతం. ఆవేదనా గీతం.

ఇంక నన్ను నిర్బంధించకు నేస్తం, ఈ రాత్రి నేను పాడలేను
ఈ కృత్రిమ వేషాన్ని అభినయింపలేను

మానవత లేని లోకాన్ని స్తుతింపలేను

మానవునిగా శిరసెత్తుకు తిరగలేను

ఈ నాగరికతారణ్యావాసం భరించలేను...

ఇలా సాగుతుంది దేవరకొండ బాలగంగాధర తిలక్ వ్రాసిన 'ఆర్తనాదం'

0 0 0

బల్లపరుపుగా పరుచుకున్న జీవితం మీద నుంచి భార్యామణి తాపీగా నడిచి వచ్చి అంది కదా

'పంచదార లేదు, పాల డబ్బా లేదు బొగ్గుల్లేవు, రాత్రికి రగ్గుల్లేవు'

రోజూ పాడే పాత పాటకి, రోజూ ఏడ్చే పాత చావుకి విలువలేక విని కూడా

కదలకుండా గొంగళి పురుగు సగం సగం తిన్న కలల్ని నెమరేస్తూ నిద్రపోయింది'

గొంగళిపురుగులు అనే కవితలో తిలక్ హాస్య ధోరణిలోనే అయినా, సమాజంలో కరుడు కట్టుకుపోయిన మానవతా లేమిని, దానికి తన వేదనాపూరితమైన స్పందననీ మనకి కళ్ళకి కట్టినట్టు చూపిస్తాడు.

ఇంతకీ ఎవరీ దేవరకొండ బాలగంగాధర తిలక్?

0 0 0

'ఆధునిక కవితారంగంలో, అంటే శ్రీశ్రీ యుగంలో తమ రచనలు గ్రంధరూపంలో రాకపూర్వమే యావదాంధ్ర దేశంలో ఉత్తమ కవులుగా లబ్ధప్రతిష్ఠులైనవారు ముగ్గురున్నారు. వారిలో తిలక్ ఒకడు. మిగిలిన ఇద్దరూ శ్రీశ్రీ, అజంతా. వచన కవితా ప్రక్రియను పరిపుష్టం చేసిన కొద్దిమందిలో తిలక్‌కు ప్రత్యేక స్థానం వుంది. పరిపక్వమైన వచన గేయపు శైలికి అతను ఎంతో దోహదం చేశాడు. వచన గేయపు శైలిలో తిలక్ చూపిన ఒడుపుల వల్ల ఆ ప్రక్రియ సంప్రదాయ పద్య కవితాభిమానులను కూడా చాలావరకు వశపరుచుకుంది' అంటారు తిలక్ మిత్రులు కుందుర్తి.

'కలల పట్టు కుచ్చులు ధరించి, కవితామృతపానం చేసిన నిత్య యౌవనుడు

అదృష్టాధ్వం సమకూరినా, అగాధ బాధా పాదఃపతంగాల ఆక్రందనల్ని ఆలకించినవాడు

జడత్వ, మూఢత్వాల సమూలచ్ఛేదానికి సమకట్టినవాడు

కవితామృతానికి జీవన వాస్తవికతల హాలాహలాన్ని జోడించి

కొత్త టానిక్ తయారుచేసిన సాహితీ భిషక్ పలకరించ వచ్చాడీ పుటల్లోకి

అతని పేరు నవ కవితా బాల, గంగాధర తిలక్!'

1921లో జన్మించిన తిలక్, తనదైన కవితాశైలిలో వ్రాసిన 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటి రాష్ట్ర, కేంద్రీయ సాహిత్య ఎకాడమీ పురస్కారాలను అందుకుంది. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రభావంతో, గ్రాంధిక శృంగార శైలిలో తిలక్ వ్రాసిన ఎన్నో కవితలు ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. 1945లో ప్రచురింపబడ్డ 'ప్రభాతము-సంధ్య' అనే కవితా సంపుటి ఈ శైలిలో వ్రాయబడింది. తర్వాత నర్సరావుపేటలో నవ్య కళాపరిషత్తులో చేరి అభ్యుదయ భావాలతో వ్రాసిన కవితలు, తిలక్ వ్యక్తిత్వాన్ని వెలికితెచ్చాయి.

తిలక్ కవి మాత్రమే కాదు, చక్కటి కథ రచయిత కూడాను. రవీంద్రనాథ్ ఠాగూర్, మాక్సిమ్ గోర్కీల ప్రభావం ఆయన కథల్లో కనిపిస్తుంది. 'సుందరీ-సుబ్బారావు', 'ఊరు చివరి ఇల్లు', 'తిలక్ కథలు' పుస్తకాలలో ఆయన కథలు చదవవచ్చును.

0 0 0

తన కవిత్వం గురించి తనే, 1941లో వ్రాసిన 'నా కవిత్వం' అనే గేయంలో తిలక్ ఇలా చెప్పుకున్నాడు.

'నా కవిత్వం కాదొక తత్వం
మరి కాదు మీరనే మనస్తత్వం
కాదు ధనికవాదం, సామ్యవాదం
కాదయ్యా అయోమయం, జరామయం
గాజు కెరటాల వెన్నెల సముద్రాలూ
జాజిపువ్వుల అత్తరు దీపాలూ
మంత్ర లోకపు మణి స్తంభాలూ
నా కవితా చందనశాలా సుందర చిత్ర విచిత్రాలు
అగాధ బాధ పాథఃపతంగాలూ
ధర్మ వీరుల కృత రక్తనాళాలూ
త్యాగశక్తి ప్రేమరక్తి శాంతిసూక్తి
నా కళా కరవాల ధగద్ధగ రవాలు
నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయపారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తులవహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు!

0 0 0

తిలక్‌కు మానవత్వమే మంత్రం. మనిషికీ మనిషికీ మధ్య వున్న బంధమే దేవుడు!

'మేం మనుష్యులం
మేం మహస్సులం
మాకు దాస్యం లేదు
మాకు శాస్త్రం లేదు
మాకు లోకం గీటురాయి
మాకు కరుణ చిగురు తురాయి

మేం పరపీడన సహించం

మేం దివ్యత్వం నటించం

గాలి గుర్రపు జూలు విదిలించి

పూల వర్షం భువిని కురిపించి

పాట పాటకు పొంగు మున్నీరులా

మాట మాటకి జారు కన్నీరులా

మేం ఆడతాం! మేం పాడుతాం!' - మేగ్న కార్టా

'ఉదయపు నీరెండలో నిలిచి, శిరోజ సౌఖ్యాన్ని దువ్వెనతో మంచు బాలను చూసి

ఉషఃకుమారివి నీవని ప్రశంసించు - అది అందమైన నిజం!

దారిలో ఎదురైన అంధుడిని గాంచి, తడబడుతూ నడుస్తూన్న అంధుడిని చూసి

చీకటి నీ తల్లి అని చెప్పకు సుమా! - అది కటువైన నిజం!' - *నిజాలు*

తిలక్‌ని అనుభూతి వాది అంటారు.

'నా అనుభూతి నాది. దానిని నేను ఆవిష్కరిస్తాను!' అని ఆయనే చెప్పుకున్నారు.

0 0 0

'అమృతం కురిసిన రాత్రి, అందరూ నిద్రపోతున్నారు

నేను మాత్రం తలుపు తెరచి ఇల్లు విడిచి

ఎక్కడికో దూరంగా కొండ దాటి కోన దాటి

వెన్నెల మైదానంలోకి వెళ్ళి నిలుచున్నాను

ఆకాశం మీద అప్సరసలు ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు

వారి పాదాలు తారామంజీరాలు ఘల్లుఘల్లుమని మ్రోగుతున్నాయి

వారి ధమ్మిల్లాల పారిజాతాలు గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి

వారు పృథు వక్షోజ నితంబ భారలై యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు

నన్ను చూసి కిలకిల నవ్వి యిలా అన్నారు

చూడు వీడు అందమైన వాడు, ఆనందం మనిషైన వాడు

కలలు పట్టు కుచ్చులూగుతున్న కిరీటం ధరించాడు

కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు
ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు
ఎవరికి దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు
జీవితాన్ని ప్రేమించినవాడు, జీవించడం తెలిసినవాడు
నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు
ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు

జలజలమని కురిసింది వాన, జాల్యారింది అమృతంపు సోన
దోసిళ్ళతో తాగి తిరిగి వచ్చాను, దుఖాఃన్నీ చావునీ వెళ్ళిపొమ్మన్నాను
కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను
జీవితాన్ని హాసస్మందార మాలగా ధరించాను
జైత్రయాత్ర పథంలో తొలి అడుగుపెట్టాను

అమృతం కురిసిన రాత్రి, అందరూ నిద్రపోతున్నారు
అలసి నిత్యజీవితంలో సొలసి సుషుప్తి చెందారు
అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు
అధైర్యంలో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు
అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేక పోయారు
అందుకే పాపం
ఈనాటికీ ఎవరికీ తెలియదు
నేను అమరుడనని!' - *అమృతం కురిసిన రాత్రి*

0 0 0

ఆయన కవితలు చదివిన మనందరికీ తెలుసు దేవరకొండ బాలగంగాధర తిలక్ కవితా సామ్రాజ్యంలో అమరుడని!
ఇంత చక్కటి కవిత్వం వ్రాసిన తిలక్ జీవించింది 45 సంవత్సరాలు మాత్రమే!

'అది కాదు, నాకు తెలియకడుగుతున్నాను, ఏమిటీ ఘోరం?
అబద్ధాలు ప్రకటించడానికి అలవాటుపడిపోయిన, కాదు అంకితం అయిపోయిన
ఓ దుర్వార్తా పత్రికలారా? చెప్పండి ఈ వార్త నిజమేనా?'

తిలక్ మరణ వార్త విని, శ్రీశ్రీ చేసిన ఆక్రందన ఇది!

'గాలి మూగదయిపోయింది! పాట బూడిదయిపోయింది!
వయస్సు సగం తీరక ముందే అంతరించిన ప్రజాకవి
నభస్సు సగం చేరకముందే అస్తమించిన ప్రభారవి
మరి కనిపించడా? నవభావామృత రసధుని
కవితా సతి నొసట నిత్య రస గంగాధర తిలకం
సమకాలిక సమస్యలకు స్వచ్ఛ స్ఫాటిక ఫలకం
నడినింగిని మాయమయాడా మన మిత్రుడు
కవితా పుత్రుడు కదన క్షాత్రుడు సకల జగన్మిత్రుడు!' - శ్రీశ్రీ

0 0 0

